పన్నెండేళ్ల అబ్బాయి నాకు దగ్గరగా వచ్చి అరుస్తున్నాడు.

నోటికి మాస్కు, చేతులకు గ్లౌజులు వేసుకున్నాడు.

''సార్.. పొత్తుకు పైన కొన్ని రేకలు వొలవకుండా ఉడకబెడుతున్నాం సార్! ఏం ఇబ్బంది ఉండదు. తీసుకోండి సార్..'' అంటున్నాడు.

రవిబాబు రెండు పొత్తులు తీసుకొని..

''ఏం చదువుకుంటున్నావ్?'' అనడిగాడు.

''సెవెంత్‌లోకి వచ్చేనండీ.. స్కూలు లేదు కదాని మా నాన్నకు తోడొచ్చాను'' అని చెప్పాడు ఆ అబ్బాయి.

టోల్ చెల్లింపు పూర్తయింది. ఎక్సలేటర్ తొక్కాను.

''ఇంత చిన్న వయసులోనే కుటుంబాలకు ఆసరాగా నిలిచే పిల్లలు మన దేశంలో నూటికి 17 మంది ఉన్నారని ఒక సర్వే చెప్పింది. అందుచేత ఈ పిల్లల్లో అత్యధికులు హైస్కూలు స్థాయి విద్యను కూడా దాటలేరు. ఎప్పటికి మారుతుందో ఈ పరిస్థితి..'' అన్నాడు రవిబాబు.

''అధిక సంతానం వల్లే కదండీ ఇలా అవుతుంది. కొన్ని మతాల వాళ్లకైతే కుటుంబ నియంత్రణ కూడా ఉండదు. అలాంటివాళ్లే బాధ్యత లేకుండా ఇలా రోడ్డు మీద ఎక్కువగా కనిపిస్తారు'' అన్నాను యథాలాపంగా.

నిజానికి అది నామాట కాదు. ఆనందరావుతో జరిగిన సంభాషణ ఫలితంగా వచ్చిన జ్ఞానం. రవిబాబు నావైపు చురుగ్గా చూశాడు.

''ఇందాకటి అబ్బాయి ఏ మతం వాడో తెలుసా?''.

''తెలీదు. కానీ, చాలామంది.. '' నసిగాను.

''నో! పేదరికం అధిక సంతానానికి ఒక కారణం. కానీ, సంతానానికి, మతానికి సంబంధం లేదు. ఇలాంటి పిల్లలు అన్ని మతాల్లోనూ ఉంటారు. ఇక్కడ సమస్య మతం కాదు.. ఆర్థికస్థితి సరిగ్గా లేకపోవడం, ఆదాయ వనరులు లేకపోవడం''.

నేనేమీ మాట్లాడలేదు. అతనే మళ్లీ అన్నాడు..

''చదువుకున్న యువకులు సొంత పరిశీలన ద్వారా జ్ఞానాన్ని, పరిజ్ఞానాన్ని పొందాలి. ప్రామాణికమైన పుస్తకాల్లోంచి, సమాచారంలోంచి విశ్లేషించాలి. కానీ, దురదృష్టవశాత్తూ కొంతమంది వాట్సాప్ ద్వారా జ్ఞాన సముపార్జన చేస్తున్నారు''.. అతని గొంతులో కొంత బాధ.

''మనం మన సంస్కృతిని, చరిత్రను మర్చిపోవడం వల్ల కూడా ఇలా జరుగుతుందంటారా? మన పద్ధతులు ఫాలో అయితే ప్రపంచంలో మనమే గొప్పవాళ్లం అయ్యుండేవాళ్లం అంటారు కదా?'' అన్నాను.

మామూలుగా అయితే, ఇలా ప్రశ్నార్థకాలు లేకుండా స్టేట్‌మెంట్ ఇచ్చేవాణ్ని. కానీ, ఆనందరావు మాటలు నాక్కూడా ప్రశ్నార్థకాలుగా ఉండటం వల్ల రవిబాబు నుంచి వివరణ కోరుతున్నట్టుగా అడిగాను.

''ఏ సంస్కృతీ, చరిత్రా ఆకాశం నుంచి పుట్టవు. అవి స్థిర పదార్థాలుగా ఉండవు. నిత్యం మారుతూ ఉంటాయి. పాత వాటిని పట్టుకొని వేలాడితే మనం ఇప్పుడు కాశీ మజిలీ కథల్లోలాగ పాదయాత్ర చేయాలి తప్ప ఇలా కారులో కలిసి ప్రయాణించం కదా.. ఆధునిక విజ్ఞానం అందించిన కారులోనో, విమానంలోనో ప్రయాణిస్తూ.. పుష్పకవిమానం గురించి కట్టుకథలు చెప్పుకోవడం అర్థం లేనిది కదా. అసలు ఈ కరోనా కాలంలో ప్రయాణాల్లో, డబ్బు చెల్లింపుల్లో ఎన్నెన్ని మార్పులు వచ్చాయో చూడండి. ఈ నడక అంతా చరిత్రా, సంస్కృతే! అదెప్పుడూ ముందుకు నడుస్తూ ఉంటుంది. దానిని ఒక సరైన మార్గంలో నడిచేలా చేయడమే ఆ కాలపు మనుషుల పని. పాత కాలం ఘనమైనది అనుకుంటూ ఈ కాలంలో బతకడం అంటే ఈ కాలాన్ని అవమానించడమే!'' అన్నాడు రవిబాబు.

పూర్తిగా అర్థం కాలేదు కానీ, ఈ మాటలు అర్థవంతంగా ఉన్నట్టు అనిపించింది.

''ఇదిగో ఇది తీసుకోండి'' అని మొక్కజొన్న పొత్తు అందించాడు.

''గమనించారా దీనిని. మామూలుగా అయితే, పొత్తుకున్న రేకలన్నీ తీసి ఉడకబెడతారు. అలా ఉడకబెడితే వాళ్ల చేతులు నేరుగా గింజలను తాకుతాయి. అప్పుడు తీసుకోవడానికి మనం ఇష్టపడం. ఇలాంటి అనుభవం వాళ్లకు ఉంది కాబట్టే.. ఒక వరస రేకలు ఉండగానే పొత్తును ఉడకబెట్టారు. అంటే మొక్కజొన్న పొత్తుకు మాస్కు ఉన్నట్టే! వీటిని మనం తొలగించి చక్కా తినొచ్చు. ఈ అవసరం కానీ, తెలివి కానీ ఆరునెలల క్రితం లేదు. ఇప్పుడు ఉంది. కాలానికి ముందుచూపు ఉంటుంది తప్ప వెనక చూపు ఉండదు''.

ఈ ఉదాహరణ బాగా అర్థమైంది. నిజమే కదా.. ఒక తరం కన్నా మరొక తరం స్మార్ట్‌గా ఉంటుంది. ప్రతి తరానికీ కాలం అప్పటికి చలామణిలో ఉన్న జ్ఞానాన్ని అప్‌డేట్ చేసేస్తున్నది.

రాజమండ్రి దగ్గర్లోకి వచ్చేశాం. తుంపర కాస్త వర్షంగా మారింది. వైపర్ ఆన్ చేశాను. లాలా చెరువులో వెయిట్ చేస్తున్న ఇమ్రాన్ హడావుడిగా ఫోను చేశాడు.

''బ్రదర్.. వర్షం పడుతున్నది. శంకర్ విలాస్ దగ్గర ఉన్నాం. మీరేం దాటి వెళ్లిపోలేదు కదా?'' అన్నాడు.

''లేదు. ఐదారు నిమిషాల్లో మీ ముందుంటాను'' అని చెప్పాను.

వర్షం మరింత పెరిగింది. నెమ్మదిగా లాలా చెరువు చేరుకొని, శంకర్ విలాస్ ముందు ఆగాను. ఇమ్రాన్, అతని వెంట ఒక మహిళ పరుగెత్తుకొని వచ్చారు. ఈలోగానే ఇద్దరూ బాగా తడిసిపోయారు. డోర్ లాక్ ఓపెన్ చేసి, వెనక కూర్చోమన్నాను. వాళ్ల దగ్గర తుడుచుకోవడానికి పొడిబట్టలు ఏమీ లేనట్టున్నాయి. రవిబాబు తన బ్యాగులోంచి టవలు తీసి వారికి అందించాడు.

''ఉతికిన టవలే! పర్లేదు.. తుడుచుకోండి'' అన్నాడు.

మొహమాటంగానే దాన్నందుకున్నాడు ఇమ్రాన్.

''కష్టానికి కష్టం తోడు. ఈవర్షం ఇప్పుడే రావాలా!?'' అని తనలో తాను అనుకుంటూ చేతుల మీది తడిని అద్దుకుంటున్నాడు.

''ఏమైంది?'' అనడిగాడు రవిబాబు.

''నా చిన్న చెల్లెలు నిప్పంటించుకొంది. మమ్మల్ని కాదని వెళ్లిపోయి పెళ్లి చేసుకొంది. ఏం కష్టాలు పడిందో.. వారం కిందే ఈ ఘోరానికి తలపడింది. తెలిసిన వెంటనే వెళ్లి.. డబ్బులు అవసరమై నిన్న సాయంత్రమే తిరిగొచ్చాం. ఈ పొద్దున చచ్చిపోయిందని కబురు ..'' అతని కంఠంలో దుఃఖం పలుకుతున్నది.

''దానికో రెండేళ్ల పాప ఉంది. వాళ్లేమో 'వదిలించుకుందాం!' అనుకుంటున్నారు. మాకేమో సాకేంత స్థితి లేదు. అలా అని వాళ్ల దగ్గర ఉంచాలని లేదు. రెండున్నరేళ్ల తర్వాత ఓ పది రోజుల క్రితం వాళ్ల వదినకు ఫోను చేసి, ఏడ్చిందట. బిడ్డ అనాథైపోతుందేమోనని బాధ పడిందట. అప్పుడే వెళ్లి తీసుకొచ్చేసినా దక్కేది''.. మళ్లీ సైలెంటయి పోయాడు. ఏడుస్తున్నాడు కాబోలు..

''ఊరుకో ఊరుకో..'' నెమ్మదిగా అంటున్నదామె.

రవిబాబు సీట్లో నుంచే వెనక్కి తిరిగి..

''పెద్ద బాధే ఇది. కాస్త తమాయించుకోండి. ఆ పాప భవిష్యత్తు గురించి బాధపడకండి. మీకు సాకే అవకాశం లేకపోతే మీ రాజమండ్రిలోనే అలాంటి పిల్లలకు ఒక మంచి హోం ఉంది. వాళ్లకు ఇవ్వొచ్చు. వాళ్లే పోషిస్తారు. బాగా చదివిస్తారు కూడా!'' అన్నాడు.

ఇమ్రాన్ ఒక్కసారిగా ముందుకు వొంగి..

''అవునా సార్.. ఎంత మంచిమాట చెప్పారండీ. ఆ మేలు చేసిపెట్టండి. మీ మేలు జన్మలో మర్చిపోను. మా పరిస్థితి మెరుగుపడితే ఏదోలా చూసుకుంటాం. అందాక ఆశ్రయం దొరికితే చాలు''.. అన్నాడు.

అతని గొంతులో ఆసరా దొరికిన ఆనందం..

''తప్పకుండా చేద్దాం!'' అన్నాడు రవిబాబు.

ఆ భరోసా తరువాత ఇమ్రాన్ మళ్లీ దుఃఖపడలేదు. చెల్లి వేరే మతం అబ్బాయిని ప్రేమించడం గురించి, ఆమె ఇంటి నుంచి వెళ్లిపోవడం గురించి చెబుతూనే ఉన్నాడు. మధ్యమధ్యలో పసిపాప భవిష్యత్తు గురించి, రవిబాబు భరోసా వల్ల కలిగిన ఆనందం గురించి ప్రస్తావిస్తూనే ఉన్నాడు. విజయవాడ ప్రభుత్వాసుపత్రి దగ్గర ఇమ్రాన్, అతని భార్య దిగిపోయారు. డబ్బులు ఇవ్వబోతే..

''వద్దులెండి.. ఆ పాపకు ఏమైనా కొనివ్వండి'' అన్నాను.

రవిబాబు నాకేసి చాలా సంతోషంగా చూశాడు. తరువాత తన ఫోన్ నెంబర్ వాళ్లకిచ్చి, వాళ్ల ఫోన్ నెంబర్ తీసుకొని.. ఏ అవసరం వచ్చినా తనకు కాల్ చేయమని చెప్పాడు. ఇమ్రాన్ మా ఇద్దరికీ పదేపదే థ్యాంక్స్ చెప్పి హాస్పిటల్లోకి వెళ్లిపోయాడు.

రవిబాబు బెంజి సర్కిల్లో దిగుతున్నప్పుడు..

''మీరు మనుషుల గురించి బాగా ఆలోచిస్తారు'' అన్నాను.

''మనం మనుషులం కదా.. మీలాగే నేను కూడా ఆలోచిస్తాను!'' అన్నాడు నవ్వుతూ.

''ఇదిగో.. ఈ పుస్తకం మీరు తప్పకుండా చదవాలి. ఈయన మనకన్నా ముందు, మనకన్నా ఎక్కువగా మనుషుల గురించి ఆలోచించిన మనిషి. ఆ ఆలోచనలను ఆచరణలో పెట్టిన మనిషి..'' అంటూ.. 'చే' పుస్తకాన్ని నా చేతుల్లో పెట్టి, భుజాన గుడ్డసంచి తగిలించుకొని నడుచుకుంటూ వెళ్లిపోయాడు. ■

## సత్యాజీ



సాహిత్యం.. సమాజ అభ్యున్నతికి దోహదపడాలని ఆశిస్తారు రచయిత సత్యాజీ. విశాఖ జిల్లా ఆర్.కొత్తూరు వీరి స్వస్థలం. ప్రస్తుతం విజయవాడలో నివాసం ఉంటున్నారు. వీధి అరుగుల మీద, పడక మంచాల మీద, కోవెల గడప వద్ద.. ఎన్నో కథలను కథోపకథలుగా విన్న బాల్యం ఈయనది. ఆ రోజుల నుంచే కథలు చెప్పాలనీ, అల్లాలనీ ఉబలాటపడేవారు. ఏడో తరగతిలో ఉన్నప్పుడే 'తాగుబోతు తమ్మారావు' పేరుతో నాటిక రాశారు. ఇదే ఈయన మొదటి రచన. మసీదు – మందిరం గొడవలు రేడియోలో విని, పత్రికల్లో చదివి.. కులమత విభేదాలు కూడవని చెబుతూ ఇంటర్మీడియట్ రోజుల్లోనే 'ఓ తల్లి కథ'ను రాశారు. అది బాలభారతి పత్రికలో ప్రచురితమై, ఆ నెల ఉత్తమ రచనగా ఎంపికైంది. ఆ తరువాత బాలభారతి, బాలజ్యోతి, చెకుముకి, చిన్నారిలోకం, సిరివెన్నెల వంటి పత్రికల్లో కొన్ని కథలు వచ్చాయి. జర్నలిజం మీద ఆసక్తితో ఆ రంగంలో చేరింది, పాతికేళ్లుగా పని చేస్తున్నదీ.. 'ప్రజాశక్తి'లో. 2004లో ఆంధ్రప్రదేశ్ పత్రిక నిర్వహించిన కథల పోటీలో 'బడి అవతల..' కథ ప్రథమ బహుమతి పొందింది. 2011లో నోముల సత్యనారాయణ సాహిత్య పురస్కారం అందుకున్నారు.